మాఫీ కాక.. అప్పు తీరక

మొదటిపేజీ తరువాయి...

లింగన్న (ఫైల్)

భూమిలో లింగన్న దంపతులు వ్యవసాయం చేస్తున్నారు. లింగన్న తన పేరిట ఉన్న 34 గుంటల భూమిపై రూ.80 వేల పంట రుణం, తన భార్య లక్ష్మి పేరిట ఉన్న రెండెకరాల భూమిపై రూ.1.50 లక్షల పంట రుణం తీసుకున్నారు. ఇబ్రహీంపట్నంలోని టీజీజీవీబీ రుణం పొందారు. ఎన్నికల సమయంలో రెండు లక్షల పంట రుణం మాఫీ చేస్తానని కాంగ్రెస్ ప్రకటించడంతో లింగన్న, అతడి భార్య లక్ష్మి రుణం మాఫీ అవుతుందని ఆశించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ఆంక్షలతో తమకు రుణమాఫీ చేయకపోవడంతో ఆ దంపతులు హతాశులయ్యారు. భార్యాభర్తల పేరిట రుణం 2.30 లక్షలు ఉన్నదని, మీకు రుణమాఫీ కాలేదని బ్యాంకు అధికారులు స్పష్టం చేశారు. పంట రుణం మాఫీ అయ్యే అవకాశం లేదని, కచ్చితంగా వడ్డీతో సహా అప్పు చెల్లించాలని బ్యాంకు అధికారులు తేల్చిచెప్పారు. పలుమార్లు వ్యవసాయశాఖ అధికారులను, బ్యాంకు అధికారులను కలిసి తనకు రుణమాఫీ చేయాలని కోరినా ప్రయోజనం లేకపోవడంతో లింగన్న దంపతులు తీవ్ర నిర్వేదానికి లోనయ్యారు. భూమి కొనుగోలు, పంట వేసేందుకు దాదాపు రూ.15 లక్షలు అప్పు చేసిన లింగన్న, కాంగ్రెస్ సర్కార్ చేస్తానన్న 2 లక్షల రుణం మాఫీ కాక తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు. 15 లక్షల అప్పులు, వడ్డీతో కలిపి బ్యాంకులో తీసుకున్న రుణం, పిల్లల పెంపకం, కుటుంబాన్ని పోషించాల్సిన బాధ్యత అన్నింటిని తలుచుకొని వేదనకు గురై జనవరి 14న చేనులోనే పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు వారు మెట్‌పల్లి దవాఖానకు తరలించించారు. వారం మృత్యువుతో పోరాడిన లింగన్న జనవరి 20న మృతిచెందాడు. లింగన్న మృతితో ఆయన భార్య లక్ష్మి, 14ఏండ్ల కొడుకు హర్షవర్ధన్, 9 ఏండ్ల కూతురు నైనిక కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

నేడు బీఆర్ఎస్ బృందం పర్యటన

ఆత్మహత్యలకు పాల్పడుతున్న రైతు కుటుంబాలకు భరోసా కల్పించేందుకు ఏర్పాటైన బీఆర్ఎస్ కమిటీ నేడు జగిత్యాల జిల్లాలో పర్యటించనున్నది. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో రైతు పిట్టల లింగన్న కుటుంబాన్ని పరామర్శించనున్నది. వ్యవసాయ శాఖ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి నేతృత్వంలో కమిటీ సభ్యులు మంగవారం ఉదయం 11 గంటలకు ఇబ్రహీంపట్నం వస్తారని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది లోనే రైతు సమస్యలు మళ్లీ మొదటికి వచ్చాయని, రైతుభరోసా, కరెంట్, సకాలంలో ఎరువులు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం చేసిన మోసం నుంచి రైతులు కోలుకోవడం లేదన్నారు. రెండు లక్షల రుణమాఫీ చేశామని ప్రభుత్వం చెప్తున్నా క్షేత్రస్థాయిలో ఇంకా 40 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదని, దీంతో చాలా మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వాపోయారు. ఈ నేపథ్యంలోనే రైతు ఆత్మహత్యలపై అధ్యయనం చేసి, నివేదికను రూపొందించడంతోపాటు రైతు కుటుంబాల్లో మనోధైర్యం నింపేందుకు బీఆర్ఎస్ కార్యాచరణ రూపొందించిందని చెప్పారు. ఇబ్రహీంపట్నంలో లింగన్న కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో రైతులతో కమిటీ సభ్యులు సమావేశం కానున్నట్టు వివరించారు.

రాహుల్‌గాంధీ.. మేమేం పాపం చేశాం?

'రాహుల్‌గాంధీ మేమేం పాపం చేశాం.. సీఎం రేవంత్ మాకు రైతు భరోసా డబ్బులు వేస్తలేడు' అంటూ సోమవారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముక్రా(కే) రైతులు మక్కచేనులో నిరసన తెలిపారు. రాహుల్‌గాంధీకి సెల్ఫీ వీడియోలు పంపారు. రైతు భరోసా, ఆత్మీయ భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. – ఇచ్చోడ

ఇల్లమ్మి బాకీలు కడుతా

ఆయన పోయినంక అంతా చీకటైంది • బిడ్డ.. డాక్టర్ అయితనని కోరుకుంది • ఆయన చనిపోంగనే చదువాపేసినం
చదివించలేక ఓ అయ్య చేతిలో పెట్టినం • ఎకరం భూమిల పసలుకు 50 వేలస్తలేవు • నాటైనంక నా కొడుకు, నేను కైకిలివోతున్నం

- ఇల్లమ్మి ఉన్న అప్పు తీర్చాలని చూస్తున్నం
- ఆత్మహత్య చేసుకున్న కరీంనగర్ రైతు ముష్కు సదయ్య భార్య రేణుక ఆవేదన
- కనీసం ఎవరూ పరామర్శించలేదని కన్నీళ్లు
- సగంలో ఆగిపోయిన ఇంట్లోనే నివాసం

కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బొంతుపల్లిలో తన కుటుంబ పరిస్థితిని వివరిస్తూ కన్నీటి పర్యంతమవుతున్న సదయ్య భార్య రేణుక, అసంపూర్తిగా ఉన్న వారి ఇల్లు

'ఉన్న ఎకరం పొలం మంచిగ చేసుకుందామని అప్పుజేసిండు. గొర్రెలు కొన్నడు.. ఆవులు కొన్నడు.. ఏదీ సాతియ్యలే. చేసిన అప్పులు పెరిగి నెత్తిమీద కుంపటైనయి. పైసలు ఎక్కడికెళ్లి తెచ్చేదని నిత్యం రంది పడ్డడు. అప్పోసప్పో చేసి బిడ్డను ఓ అయ్య చేతిలో పెట్టాల్నని మస్తు బాధపడ్డడు. బిడ్డ రుణం తీర్చుకోక ముందే ఎల్లిపోయిండు. మాకు దిక్కు లేకుంట చేసిండు' ఇదీ కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బొంతుపల్లి గ్రామంలోఆత్మహత్య చేసుకున్న ముష్కు సదయ్య (45) భార్య రేణుక నిర్వేదం. ఆమెను కదిలిస్తే.. 'ఆయన పైన మాటలేకుంట ఉన్న ఇల్లమ్మి అప్పుల్ని కడుతా' అని కన్నీటిపర్యంతమైంది. కాంగ్రెస్ అధికారంలో రాష్ట్రంలో తనువు తీసుకున్న రైతు కుటుంబాలకు ఆసరా లేదనడానికి ఇదీ ఓ నిదర్శనం.

కరీంనగర్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బొంతుపల్లి గ్రామానికి చెందిన ముష్కు సదయ్య (45), రేణుక దంపతులు. వీరికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. డాక్టర్ కావాలన్న బిడ్డ కోర్కెను తీర్చాలని, కొడుకును ప్రయోజకుడిని చేయాలన్న ఆశతో ఆ దంపతులు ఉన్నారు. ఇంతలోనే ఆ ఇంటిపై అప్పుల పిడుగు పడింది. వ్యవసాయానికి, కుటుంబ పోషణకు చేసిన అప్పులు క్రమంగా పెరిగి మోయలేని భారంగా మారాయి. గొర్రెలు, ఆవుల పోషణ కూడా ఆ ఇంటి అప్పులకు దారిచూపలేదు. తెలంగాణ వచ్చినంక పదేండ్లపాటు పెట్టుబడులకు, ఇతర పనులకు సదయ్య, రేణుక కుటుంబం ఎలాంటి ఇబ్బందులు పడలేదు. కానీ ఏడాది క్రితం వచ్చిన కాంగ్రెస్ సర్కార్ ఎలాంటి ఆసరా ఇవ్వలేకపోయింది. రైతుభరోసా అందని ద్రాక్షే అయింది. అప్పులబాధతో మనస్తాపం చెందిన సదయ్య విధిలేక 2024 ఫిబ్రవరి 12న తమ వ్యవసాయ బావి వద్దే చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో సదయ్య మరణం తర్వాత ఆ ఇల్లు పూర్తిగా ఆగమైంది. పట్టించుకునే పాలకులు కానరాలేదు. అప్పులు తీర్చేదారిలేదని, ఎదిగిన బిడ్డ పెండ్లి ఎలా చేయాలనే మనోవేదనతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు సదయ్య భార్య రేణుక ఆవేదన వ్యక్తం చేస్తున్నది. ఏడాది కావస్తున్నా ఈ ప్రభుత్వంలో తనకు వితంతు పింఛన్ కూడా అందక కుటుంబం ఇబ్బందుల్లో ఉన్నట్టు దుఃఖభారంతో చెప్పింది.

ఆగిన సదయ్య బిడ్డల చదువు

సదయ్య ఆత్మహత్యతో ఆ కుటుంబం దిక్కులేనిదైంది. ఇంటర్ వరకు చదివిన సదయ్య కొడుకు రాజు అప్పటికే ఇల్లు గడవక చదువు మానేశాడు. ఇంటర్‌లో బైపీసీలో 900కు పైగా మార్కులు సాధించిన ఆయన కూతురు అనూష చదువుపైనా భారం పడింది. చదువులో విశేష ప్రతిభ చూపిన బిడ్డ అనూష కోరిక మేరకు డాక్టర్ చేయాలన్న సదయ్య కలకలగానే మిగిలింది.

కేసీఆర్ 'రైతు బీమా'యే ఆసరా

సదయ్య మరణం తర్వాత దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆయన కుటుంబాన్ని చివరికి రైతు బీమా పథకమే ఆసరగా నిలిచింది. ఆయన మరణించిన నెల తర్వాత ఈ పథకం కింద వచ్చిన రూ.5 లక్షలు ఈ కుటుంబానికి కొండంత అండగా నిలిచాయి. అప్పటివరకు ఉన్న రూ.10 లక్షల అప్పుల్లో ఒక్కొక్కరికీ కొంత కొంత చెల్లించిన ఆ ఇల్లాలు కుటుంబ పరువును నిలిపింది. ఈ అప్పు చెల్లింపులు సదయ్య కూతురు అనూష పెండ్లికి కలిసి వచ్చాయి.

అప్పు తీర్చేమార్గం లేక..

మిగిలిన అప్పు, బిడ్డ పెండ్లి అప్పులను తీర్చే మార్గం కూడా సదయ్య కుటుంబానికి లేకుండాపోయింది. ఉన్న ఎకరంలో పసలుకు రూ.50 వేలు కూడా రావడం లేదని రేణుక, కొడుకు రాజు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సదయ్య ఉండగానే సగం నిర్మించిన ఇంట్లోనే ఆ కుటుంబం కాలం గడుపుతున్నది.

పట్టించుకోని పాలకులు

సదయ్య చనిపోయినప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ ఒక్కరూ కనీసం పరామర్శించలేదు. అధికార పార్టీ నాయకులు ఎవరూ ఆ ఇంటి ముఖం చూడనేలేదు. సదయ్య చనిపోయాక ఆర్థికంగా చితికి పోతున్న ఆ కుటుంబానికి ప్రభుత్వం సాయం అందని ద్రాక్షగానే మిగిలింది. అప్పులుతీరే దారికలేక, జీవనం గడవని ఆ కుటుంబాన్ని ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకున్న దాఖలాలే లేవని స్థానికులు కూడా చెప్పారు. సదయ్య ఎలా చనిపోయాడు, ఎందుకు చనిపోవాల్సి వచ్చింది, ఎంత అప్పు అయింది.. అని అడిగేందుకు ఏ ఒక్క అధికారి కూడా ఆ ఇంటి గడప తొక్కలేదని తెలిపారు. ఇంతటి గడ్డు పరిస్థితుల్లో ఉన్న ఈ కుటుంబానికి రైతు భరోసా అందలేదు. అలాగే సదయ్య భార్య రేణుకకు ఇంత వరకూ వితంతు పింఛన్ రావడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రేణుకు కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

ఒక్కలు కూడా పరామర్శకు రాలే..

మా నాన్న చనిపోయి దుఖంలో ఉన్న మా కుటుంబాన్ని పరామర్శించేందుకు ఒక్క నాయకుడు రాలే. ఒక్క అధికారీ రాలే. మా నాన్న చానా ఇజ్జత్ మనిషి. వ్యవసాయం కోసం చేసిన కొంత అప్పు వడ్డీ పెరిగి మోతకోలు అయ్యింది. అది తీర్చలేక, మా చెల్లి పెండ్లి చేయలేక పోతున్నానని మనోవేదనకుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నడు. ఇల్లు గడవడానికి నా చదువు సుతం ఆపేసి కూలి పనులు చేసినా అప్పులు తీరలే. ఒక రైతు అప్పుల బాధతో చనిపోతే ఎందుకు చనిపోవాల్సి వచ్చిందని ప్రభుత్వం విచారణ చేయొద్దా? మా కుటుంబం ఇప్పుడు ఆగమైంది. మా చెల్లె పెండ్లికి చేసిన అప్పు సుతం తీరే పరిస్థితి కనిపిస్తలేదు. ఉన్న ఇంటిని అమ్మి అప్పు కట్టాలని చూస్తున్నం. ఏ రైతు కుటుంబానికి మాలాంటి పరిస్థితి రావద్దని కోరుకుంటున్న.

- ముష్కు రాజు, సదయ్య కొడుకు

పథకాల ప్రచారంలో కాంగ్రెస్ ఫెయిల్!

మంత్రుల్లో తీవ్ర అసంతృప్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ పనితీరుపై పలువురు మంత్రులు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలిసింది. ప్రభుత్వ నిర్ణయాలు, విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పార్టీ పూర్తిగా విఫలమైనట్టు అసహనం వ్యక్తంచేస్తున్నట్టు సమాచారం. అందుకే ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా ప్రజల్లో తమపై వ్యతిరేక భావనకు ఇదే ముఖ్య కారణమని సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తంచేస్తున్నట్టు తెలిసింది. 'ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకుంటే.. పార్టీ దానిని భుజాలకు ఎత్తుకొని ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలి. ఈ విషయంలో మా పార్టీ పూర్తిగా ఫెయిల్ అయ్యింది' అంటూ ఓ మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసినట్టు సమాచారం. ఇందుకు ఇటీవలి సంఘటనలే ఉదాహరణగా చెప్తున్నారట. ప్రతిష్టాత్మకంగా నాలుగు పథకాలను ప్రారంభిస్తే పార్టీ సరిగా పని చేయకపోవడంతో ప్రజల్లో సానుకూలత కన్నా వ్యతిరేకతే పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారట. ఇక కులగణన సర్వే విషయంలోనూ పార్టీ పూర్తిగా ఫెయిల్ అయినట్టు మండిపడుతున్నారట. పాలన గాడిలో పడక, పార్టీ సరిగా లేక ప్రజల్లో చులకవుతున్నామని వాపోతున్నట్టు సమాచారం.

అంగన్‌వాడీలకు నిధులివ్వాలి : సీతక్క

హైదరాబాద్, ఫిబ్రవరి 3(నమస్తేతెలంగాణ): తెలంగాణలోని అంగన్‌వాడీ సెంటర్లకు నిధులు పెంచాలని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణదేవికి రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. సోమవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసిన అంగన్‌వాడీల్లో అమలు చేయనున్న బ్రేక్‌ఫాస్ట్ పథకానికి సంబంధించి ప్రతిపాదనలు సమర్పించి నిధులు కేటాయించాలని కోరారు.

జనవరిలో 19 ఏసీబీ కేసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): ఏసీబీ ఈ ఏడాది జనవరిలో 19 కేసులు నమోదు చేసినట్టు డీజీ విజయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10 ట్రాప్ కేసులు, ఒకటి ఆదాయానికి మించిన ఆస్తుల కేసు ఉన్నాయి. 1,45,000 స్వాధీనం చేసుకున్నారు.

కరెంటు షాక్‌తో రైతు మృతి

నిర్మల్ జిల్లాలో ఘటన

బోర నర్సయ్య (ఫైల్)

సోన్, ఫిబ్రవరి 3: పొలంలో విద్యుత్తు షాక్ తగిలి రైతు మృతి చెందిన ఘటన నిర్మల్ జిల్లాలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. సోన్ మండలం పాక్‌పట్ల గ్రామంలో రైతు బోర నర్సయ్య (45) రెండెకరాల భూమిని కౌలుకు తీసుకుని మక్కజొన్న సాగు చేస్తున్నాడు. ఈ భూమి గోదావరి ఒడ్డున ఉండటంతో అడవి పందులు వచ్చి పంటను నాశనం చేస్తున్నాయి. ఆదివారం సాయంత్రం పంటల రక్షణకు ఎర్తింగ్ వైరు బల్బులు అమర్చాడు. సోమవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో వైర్లను తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి కిందపడిపోయాడు. నర్సయ్య కుమారుడు భరత్ గోదావరి ఒడ్డుకు వెళ్లి వచ్చేసరికి తండ్రి పడిపోయి ఉండటంతో చుట్టు పక్కల రైతుల సహాయంతో నిర్మల్‌లోని ఏరియా దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై షేక్ హైమద్ తెలిపారు.

బోనస్ కోసం ఎదురుచూపులు

- రెండు నెలలైనా రైతులకు అందని బోనస్
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 20 వేల మంది నిరీక్షణ
- రూ.41 కోట్లకు పైగా బకాయిలు
- రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి
- రైతు భరోసా రాక, బోనస్ అందక ఇబ్బందులు
- ఎప్పటిలోగా చెల్లిస్తారో చెప్పని ప్రభుత్వం
- స్పష్టత ఇవ్వని అధికారులు

పక్క చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు బోడ మహేందర్‌రెడ్డి. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం మర్రివానిపల్లె గ్రామం. నాలుగెకరాల్లో సన్నరకం వరి సాగు చేయగా.. 92 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. నవంబర్ 25న బోగంపాడు పీఏసీఎస్ కేంద్రంలో ధాన్యం విక్రయించాడు. క్వింటాల్‌కు రూ.500 చొప్పున మొత్తం రూ.46 వేల బోనస్ రావాలి. పదిహేను రోజుల్లోనే బోనస్ డబ్బులు వేస్తామని చెప్పి రెండు నెలలైనా పడలేదు. ఇలా ఒక్క మహేందర్ రెడ్డే కాదు, ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా సుమారు 20 వేల పైచిలుకు రైతులు బోనస్ కోసం కండ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు.

బోడ మహేందర్‌రెడ్డి

మాటలను నమ్మిన రైతులు బోనస్ వస్తుందన్న ఆశతో కొనుగోలు కేంద్రాల్లోనే సన్నాలను విక్రయించారు. రెండు నెలలైనా బోనస్ డబ్బులు వేయలేదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ఇంకా రూ.41 కోట్లు చెల్లించాల్సి ఉన్నది. ఇక రాష్ట్రవ్యాప్తంగా ఏ మేరకు బకాయిలు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

బహిరంగ మార్కెట్‌ను కాదని

వానాకాలంలో బహిరంగ మార్కెట్‌లో సన్నరకం ధర క్వింటాల్‌కు రూ.2,750 పలికింది. రేవంత్ సర్కారు మద్దతు ధరతోపాటు.. రూ.500 బోనస్ కూడా ఇస్తామని చెప్పింది. ఈ నేపథ్యంలో వారి మాటలు నమ్మి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా మారింది. బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర దక్కక, బోనస్ అందక లబోదిబోమంటున్నారు. కనీసం ఎప్పుడిస్తారో ప్రభుత్వం చెప్పడం లేదు, అధికారులకు స్పష్టత లేదు. మరోవైపు రైతుభరోసా కూడా ఇవ్వకపోవడంతో మళ్లీ అప్పుల కోసం వెంపర్లాడే దుస్థితి తలెత్తింది.

కరీంనగర్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ హుజూరాబాద్: అధికారంలోకి రాగానే వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తామని రైతులకు కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఆ హామీని నెరవేర్చకుండా రెండు సీజన్లకు ఎగనామం పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. మాట మార్చి 'సన్న వడ్లకే బోనస్' అంటూ వానాకాలం సీజన్‌లో అమలు చేసింది. పాలకుల

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రైతులకు చెల్లించాల్సిన బోనస్ వివరాలు

జిల్లా	ధాన్యం కొనుగోలు (మెట్రిక్ టన్నులు)	చెల్లించాల్సిన బోనస్ (రూ.కోట్లలో)	చెల్లింపులు (రూ.కోట్లలో)	బకాయిలు (రూ.కోట్లలో)
పెద్దపల్లి	2,29,443	114.72	89.12	25.60
జగిత్యాల	31,092	15.54	3.62	11.92
కరీంనగర్	72,135	36.06	33.82	2.24
రాజన్నసిరిసిల్ల	61,605	30.802	29.55	1.24

సర్కారు మాపై దయచూపాలె

బోగంపాడు పీఏసీఎస్ కేంద్రంలో నవంబర్ 23న 134 క్వింటాళ్ల దాన్యం అమ్మిన. రూ.67 వేలు బోనస్ డబ్బులు ఇప్పటివరకు రాలేదు. అధికారులను అడిగితే తెల్వదంటున్రు. బ్యాంకులకు వెళ్తే ఇంకా రాలేదంటున్రు. గట్టిగా అడిగితే అధికారులు కోపానికి వస్తున్రు. సర్కారుకు ఇవ్వడం ఏందీ? ఇచ్చిన తర్వాత బాధపడుడేంది? అని ఇప్పుడనిపిస్తుంది. సర్కారు మాపై దయచూపాలె.

- పైండ్ల రాజిరెడ్డి, మర్రివానిపల్లి

రెండు నెలలైనా బోనస్ రాలే

ఎకరంలో 21 క్వింటాళ్ల దిగుబడి అచ్చింది. నవంబర్ 28న అమ్మిన. ఇప్పటివరకు బోనస్ రాలే. వస్తాయో రావో తెల్వది. నా లెక్కన చాలా మంది రైతులు బోనస్ కోసం చూస్తున్రు. మేం అమ్మే సమయానికి బయట మార్కెట్‌లో రేటు బాగానే ఉంది. బోనస్ వస్తుంది కదా అని ఆశపడి ప్రభుత్వానికే అమ్మితే గిట్ల బోనస్ ఇయ్యకుండా గోస పెడుతంది.

- చిలుకమారి మహేందర్, కాట్రపల్లి, హుజూరాబాద్ మండలం

కరెంటు సమస్యపై రైతన్న కన్నెర్ర

కరెంటు సమస్యను నిరసిస్తూ నిర్మల్ జిల్లా ముథోల్ మండలం విట్టోలి గ్రామ రైతులు సోమవారం ముథోల్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఫీడర్‌లో సమస్య ఉండటంతో మూడు, నాలుగు రోజుల నుంచి కరెంటు సమస్యలు ఉత్పన్నం కావడంతో పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. - ముథోల్

సోలార్ ప్లాంట్ వద్దంటూ రైతుల వినతి

ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం పెండల్‌వాడ చెరువు పరిసరాల్లో సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయొద్దంటూ రైతులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. చెరువుకు మరమ్మతులు చేసి సాగునీరు అందించాలని, ఏమైనా నిర్మాణాలు చేపడితే నష్టపోతామని రైతులు సూచించారు.

- ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ

ఖమ్మం మార్కెట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

ఖమ్మంలో మిర్చి రైతు ఆందోళన

- 'సిండికేట్' మోసంపై రైతు సంఘం ధర్నా
- బిగొచ్చి మిర్చి ధరను సవరించిన అధికారులు

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 3 : మిర్చి ఖరీదుదారులు సిండికేట్‌గా మారి ఆశించిన ధర రాకుండా మోసానికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. వ్యాపారుల వైఖరిని నిరసిస్తూ మిర్చి యార్డులో జెండాపాటను అడ్డుకున్నారు. తొలుత జెండాపాట క్వింటా ధర రూ.13 వేలుగా నిర్ణయించగా.. రైతు సంఘం ఆందోళన నేపథ్యంలో జెండాపాటను క్వింటా రూ.14,200గా నిర్ణయించి అమలు చేశారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు మాట్లాడుతూ వ్యాపారులు, ఉద్యోగులు కలిసి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్‌తో సమావేశమై సమస్యలను వివరించారు.

పట్టాలివ్వాలని ట్యాంక్ ఎక్కిన రైతులు

- పెట్రోల్ బాటిళ్లు, పురుగు మందు డబ్బాలతో ఆందోళన
- మంత్రి పొంగులేటి హామీ ఇచ్చినా అతీగతీ లేదని మండిపాటు

మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో ట్యాంక్ ఎక్కిన నారాయణపురం రైతులు

కేసముద్రం, ఫిబ్రవరి 3: పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. పెట్రోల్ బాటిల్, పురుగుల మందు డబ్బా పట్టుకొని కేసముద్రం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న వాటర్‌ట్యాంకు ఎక్కి నిరసన తెలిపారు. 60 ఏండ్లుగా సాగు చేస్తున్న వ్యవసాయ భూములకు కొత్త రెవెన్యూ గ్రామంగా ఏర్పడిన నాటి నుంచి ఈ సమస్య ఏర్పడిందని వారు పేర్కొన్నారు. పలుమార్లు అధికారులు ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించినప్పటికి కొంత మందికే పట్టాలు ఇస్తూ చేతులు దులుపుకొన్నారని ఆరోపించారు. పట్టాలు ఇవ్వకపోవడంతో పథకాలు పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. అసెంబ్లీ సమావేశాల్లో నారాయణపురం రైతుల గురించి మాట్లాడి పట్టాలు ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా అతీగతీ లేదని మండిపడ్డారు. ఇంకా 1124 ఎకరాలకు పట్టాలు ఇవ్వాల్సి ఉన్నదని వారు పేర్కొన్నారు. తహసీల్దార్ హామీతో రెండు గంటల తరువాత ట్యాంకు దిగి వచ్చారు.

మార్కెట్‌కు పోటెత్తిన మక్కలు

వరంగల్ జిల్లా నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌కు మక్కలు పోటెత్తాయి. మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,200 పలుకుతుండగా, ప్రైవేట్ వ్యాపారులు రూ.2350 నుంచి రూ.2,420కు కొంటున్నారు. దీంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకే విక్రయిస్తున్నారు. – నర్సంపేట